# నిజంగా ఆయన మా తండ్రే!

శ్రీమతి టి. శారద (సీనియర్ క్లాసు విద్యార్థిని)

ఆరోజు బుధవారం. సాయంత్రం 4½ గంటలకు బడినుండి యింటికి వచ్చేసరికి మా పేటకు అవతల వీధిలో వున్న మాధవిగారి నాన్నగారికి జబ్బు ఎక్కువగా వుందని విన్నాను. ఆమాట వినడంతోటే నాగుండెలు దడదడ కొట్టుకున్నాయి. వెంటనే పుస్తకాలు నా గదిలో పారవేసి అక్కడేకూలబడ్డాను. చెప్పలేని దుఃఖం వచ్చింది. కళ్ళ వెంట నీరు నాకు తెలియకుండానే కారిపోయాయి. ఆయనకు మాకు ఏం సంబంధము? మీకు తెలుసా? తెలియదూ? అయితే చెబుతాను వినండి.

ఆ మాధవిగారు మా టీచరు. నేను రెండవ ఫారము చదువుచున్న దగ్గఱనుంచి ఆమె మాకు టీచరు. అప్పటినుంచీ ఆమె అంటే నాకు కానరాని ప్రేమ ఏర్పడింది. ఆమె ముఖంలో మంచి ఆకర్షణీయ శక్తివుంది. అది నన్నే కాదు మా తరగతి పిల్లలనందరను ఆకర్షించింది. ఆమెను మేమే కాదు ప్రతి ఒక్కరూ అట్లాగే ప్రేమిస్తారు. ఆమె స్వభావమే అటువంటిది. ఆమె ఒక్కరోజు క్లాసుకు రాకపోతే క్లాసు అంతా మత్తుగా వుండేది. పిల్లలంతా తహతహలాడి పోయేవారం. ఆమెను చూడకుండా ఒక్కరోజు కూడా గడపలేక పోయేవాళ్ళము. ఎంత ప్రేమవుందో అంత భయం, భక్తికూడా ఆమెమీదవున్నాయి. ఆమె ఎప్పుడూ ఏవిషయంలోకూడా మమ్ములను కోప్పడి ఎఱుగరు. అందుచేతనే ఆమె అంటే మాకు అంత గౌరవము, ప్రేమ ఏర్పడింది. ఆమె పాఠములు నేర్పడంలో చాలా నేర్పరి. ఎంత మొద్దుపిల్లలైనా సరే ఆమెచేతిలోనికి వచ్చిన తరువాత మొదటి మార్కు తెచ్చుకోవలసిందే. సాధారణంగా నాకు తెలిసినంతవరకు టీచర్లందరూ మొద్దుపిల్లలంటే కొంచెము విసుగు చూపిస్తారు. కాని మా మాధవి గారు మొద్దుపిల్లలంటే ఎప్పుడూ విసుక్కొనేవారుకారు. వారికి పాఠములు తలలోకెక్కేవరకు చెప్పి వాళ్లను పైకి తీసుకురావడమే ఆమె కర్తవ్యం. యిందుకు నిదర్శనం—నేను రెండవ ఫారం చదువుతూ వుండగా ఆమె ఒకరోజు గ్రామరులో నన్ను ఒక ప్రశ్న వేశారు. కాని అప్పుడు నేను అందరికంటె వెనుక అవటంచేత ఆమెకు చాలా బాధకలిగించాను. నామవాచకము అంటేఏమిటోకూడా చెప్పలేకపోయాను. యిప్పుడు అది ఆమెకు జ్ఞాపకం వుండకపోవచ్చు. కాని నాకు చాలా బాగా జ్ఞాపకంవుంది. అప్పుడు ఆమె విసుగుచెందకుండా మొదటినుంచీ గ్రామరు చెప్పేరు. యిప్పటికీ అది ఆమెపెట్టిన భిక్షయే. ఆమె ముఖపద్మములోనుంచి సర్వదా చిరునవ్వు తేనెలొలుకుతూవుండేవి. కోపము ఆమెలో లేనేలేదు. ఆమె అందరనూ ఒకేవిధమైన ప్రేమతో చూచేవారు. ఆమె విద్యార్థిని గానే నేను స్కూల్‌ఫైనలు లోనికి వచ్చాను. యిప్పటికికూడా ఆమె మాకు టీచరే. కాని ఆమె మాకు క్లాసులో వున్నంతసేపే టీచరు, తరువాత మా బహన్‌జీయే! అట్టి టీచరు దొరకుటకు మేము ఏనాడో గొప్ప పుణ్యము చేసుకొన్నాము. నిజంగా తల్లిదండ్రుల నొకవైపు టీచరుని ఒకవైపుపెట్టి తూయవచ్చును. వారే మన జీవితాధారములు. అట్టివారి ఋణము ఘనమేవిధముగా తీర్చగలము? మాధవిగారు మా యెదుటవుంటేనేచాలు అనిపించేది.

ఒకసారి మేము 5-వ ఫారము చదువుతూవుండగా ఆమె ఢిల్లీ వెళ్ళవలసివచ్చింది. సరిగ్గా సంవత్సరాంతపు పరీక్షలు దగ్గరకువచ్చాయి. అప్పుడు మాకు ఒకక్రొత్తటీచరుని పెట్టేరు. అప్పుడు మా దుఃఖమున కంతులేదు. ఎవరితో చెప్పుకుంటే ఎవరు వింటారు? ఆమె వెళ్ళకతప్పదు. స్టేషనుకు మేమందరము వెళ్ళాము. ఆమె మాకు పరీక్షలు బాగా వ్రాయండి అని ఎన్నో ధైర్యవాక్యాలు చెప్పినారు. కాని లాభం లేకపోయింది. మా కళ్ళవెంట నీరు ధారాపాతంగా కారిపోతున్నాయి. ఎంత ఆపుకుందామని ప్రయత్నముచేసినా మావశం కాలేదు. ఒక్కరోజు క్లాసుకు రాకపోతే వుండలేకపోయేవాళ్ళము. 1 నెలరోజులు ఆమె చూడకుండా ఎట్లావుండడం? యిదే మా దుఃఖకారణం. మా అవస్థ చూచి మా టీచరు నాన్నగారు మాకు ఎన్నో ధైర్యవాక్యాలు చెప్పారు. మా టీచరును మా పరీక్షల సమయమునకు మా

దగ్గర ఉండేటట్లు చేస్తానని మాకు వాగ్దానము చేసేరు. తండ్రి లాగా బుజ్జగించి ఎన్నో విధాల చెప్పారు. ఆయన తియ్యని ధైర్యపు పలుకులకు మా శ్రోత్రధారలు కట్టినవి. రైలు కదలింది. మా గుండెలలో పెద్దరాయి పడింది.

ఆరోజు మొదలుకొని మాధవిగారి నాన్నగారు మా నాన్నగారే ? నిజంగా ఆయన మాతండ్రే! ఆయన ఏమిటింగ్‌లో కనపడ్డా నదురుచెదురులేకుండా ఆయన ఎక్కడ వుంటే అక్కడకు పరుగెత్తుకువెళ్ళి "బాబాజీ" మా మాధవిగారు ఎప్పుడు వస్తారు? రమ్మని వుత్తరంవ్రాసారా?" అన్నదే మాప్రశ్న. అప్పుడు ఆయన మాతో మధురకంఠంతో "వుత్తరం వ్రాసాను తల్లీ! ఏం చెయ్యను యింకారాలేదు. రేపు అర్జంటుగా రమ్మని వైరు ఇద్దాము." అన్నదే ఆయన సమాధానం. దీనితో ఆయనకు మాకూ తండ్రీ పిల్లల సంబంధం ఏర్పడింది. ఆయన పలుకులలో తేనెవుంది. దాని మీద మేము వ్రాలాము. అప్పటి నుంచి ఆమె నాన్నగారే మా నాన్నగారు.

నేను భగవంతుని దయవలన స్కూలు ఫైనలులోకి వచ్చాను. మా నాన్నగారు అమ్మ ఎంతో పట్టుదల వహించి నాకు చదువు చెప్పించుచున్నారు. నిజంగా అట్లాంటి తల్లితండ్రులు దొరకటం కష్టమే. అదృష్టంవల్ల మా మాధవి టీచరే మాకు ఇంగ్లీషు టీచరు. ఆమె పాఠాలు చెప్పుతూవుంటే మన స్సులోనుండి వుత్సాహం పుట్టుకొచ్చేది. రోజులు చాలా సంతోషంగా గడుస్తున్నాయి. కాని మా కాలచక్రం తిరిగింది. మా టీచరుగారి నాన్నగారికి కొంచెం జబ్బుగావుంది. కాని మేము గోలచేస్తామని మా టీచరు మాతోచెప్పలేదు కాని ఆ సంగతి తెలియగానే నేను మరికొందరు పిల్లలు కలసి వెళ్ళాము. అప్పుడు ఆయన మంచంమీద పండుకొని ఎప్పటిమాదిరిగా కన్నకుమార్తెలతో మాట్లాడిన విధంగా నవ్వుతూ మమ్ములను నవ్వించుతూ మాట్లాడినారు. తరువాత మా టీచరుతో కొంచెము సేపు మాట్లాడి యింటికి వచ్చాము. ఆయన చిరునవ్వుముఖమే మా కళ్ళకు కనుబడుతూవుండేది. ఈరోజు శనివారం. రాత్రి నిద్దరపట్టలేదు.

కాని దుఃఖవార్త! వినలేము. బుధవారంనాడు గుండె దడకిదే కారణం. బుధవారంనాడు 4 గంటలకు ఆయన మమ్మందరనువిడిచి వెళ్ళిపోయినారు. మాకందరకు చెప్పలేని దుఃఖమునిచ్చి వెళ్ళిపోయినారు. ఆనూట మా అమ్మ చెప్పగానే నేను నమ్మలేదు. కాని నిజమే. మా "చాచా" (టీచరు నాన్నగారు) యింక మమ్ములను చూడరు. మాతో ఎప్పటిలాగా మాట్లాడరు. మాకు కనుపించరు. మా టీచరు మాదగ్గరలేరని ఏడుస్తూ వుండగా ఆయన మమ్ములను ఒకసారి ఓదార్చారు. యిప్పుడు ఎవరు మమ్ములను బుజ్జగిస్తారు? ఎవరు మాకు తియ్యనిమాటలతో ధైర్యం చెపుతారు ? ఎవరూలేరు. మా అమ్మ నాన్నగారుకూడా ఆయన మరణవార్తవిని ఎంతో విచారించారు. నా దుఃఖం ఆపలేకపోయారు. కాని మా మాధవి గారి దుఃఖము చూడలేము. మనస్సులో ఆమె చాల బాధపడుతున్నారు. యిప్పుడు ఆమె బాధపడుతూ ంటే నేను చూడలేకపోయాను. అక్కడ ఒక్కక్షణం వుండలేకపోయాను. అబ్బ! పాతదృశ్యాలు తలచుకొన్న కొద్దీ బాధ ఎక్కువై పోతోంది. దుఃఖమాగడం లేదు. వ్రాయలేను......కలం ముందుకు సాగడంలేదు..గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అబ్బ! ... వ్రాయలేను ... వ్రాయలేను...నిజంగా ఆయన మా తండ్రే.

ఆయన మనశ్శాంతికై నేను భగవంతుని ప్రార్థిస్తున్నాను. ఆయనకు మనశ్శాంతి కలుగుగాక!

★


## శుభవార్త

ఔషధములు, ఆపరేషనులు, ఇంజక్షనులతో నిమిత్తము లేకుండా సమస్త వ్యాధులు నివారణ గావింపబడును. వివరములు కోరువారు రు. 0-8-0 పోస్టు బిళ్లలు పంపిన ఆశ్రమ నివేదిక పంపబడును.

శ్రీ యోగాశ్రమము,
(వయా) రేపల్లె,
గుంటూరు జిల్లా.